క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



తులసీదళాల అలంకరణలో వేణుగోపాలస్వామి

జామి: మండలంలో భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వరప్రసాద్ ఆచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి దర్శించుకుని అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అన్నంరాజుపేటలో పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి తులసీదళాలతో అలంకరించి పూజలు చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తవలస: మండల కేంద్రంలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. అధికారులు లేఅవుట్‌లో పర్యటించి ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ లేఅవుట్‌లో వీరభద్రపురం, కొత్తవలస మేజర్ పంచాయతీ సచివాలయం-1,2,4 పరిధిలో 189 మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణరావు తెలిపారు. ఇప్పటివరకు కేవలం 33 ఇళ్లు మాత్రమే వందశాతం నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నాయన్నారు. మిగిలినవి వివిధ స్టేజ్‌లలో నిర్మాణాలు జరుగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..



మొక్కలు నాటుతున్న ఫొటోగ్రాఫర్ల సంఘ ప్రతినిధులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): మొక్కలను సరంక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఫొటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సుంకరపల్లి సతీష్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మండలంలోని రామలింగాపురం-వుర్రేయవలస గ్రామాల పరిసరాల్లో వెలసిన మానసాదేవి నాగశక్తి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గణేష్ ఎఫెక్ట్స్ ఫొటోగ్రఫీ అధినేత లాబాన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఫొటోగ్రఫీకి ఆద్యుడు అయిన లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

జామి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు జాగరపు ఈశ్వరరావు కోరారు. జాగరం గ్రామంలో మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో కోనేరు అభివృద్ధిపై శనివారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. చెట్లు, చెరువుల ప్రాముఖ్యలను ప్రజలకు వివరించారు. రిపబ్లిక్ డే వేడుకల వరకు అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సేవాసంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బిందు, తుంపర సేద్యంతో ప్రయోజనం



తుంపర సేద్యం యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ, తదితరులు

శృంగవరపుకోట: బిందు, తుంపర సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేయవచ్చని ఏపీఎంఐపీ పీడీ పీఎన్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ముషిడిపల్లి గ్రామంలో రైతు గార్లపాటి సత్యసాయికి రాయితీపై అందించిన తుంపర సేద్యం యూనిట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెట్ట ప్రాంతంలో పంటల సాగుకు బిందు, తుంపర సేద్యం ఎంతో అనువుగా ఉంటుందన్నారు. ఈ విధానంలో ఎరువుల వినియోగం సమర్థవంతంగా చేపట్టవచ్చన్నారు. మండలంలో 24 మంది రైతులకు రూ.4,86,495 విలువైన 56 సూక్ష్మ సేద్యం యూనిట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట వీహెచ్‌ఏ ఎం.లావణ్యప్రభ, ఎంఐ ఏఓ మూర్తి, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే విజయం



ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న గౌతమి



జామి: గంగమ్మకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి

నియోజకవర్గంలోని పలు సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరిగింది. అనంతరం అధికారులు ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెంటశ్రీరాంపురం సర్పంచ్‌గా గౌతమి

గంట్యాడ: మండలంలోని పెంటశ్రీరాంపురం గ్రామంలో సర్పంచ్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీచేసిన కరక గౌతమి భారీ మెజార్టీతో గెలుపొందారు. శనివారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 1771 ఓట్లు పోలవగా.. గౌతమికి 933 ఓట్లు, టీడీపీ బలపరిచిన అభ్యర్థి కరక రామయ్యమ్మకు 787 ఓట్లు వచ్చాయి. దీంతో కరక గౌతమి 146 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు అధికారులు ప్రకటించారు. అదేవిధంగా వార్డు మెంబరు స్థానానికి వైఎస్సార్‌సీపీ బలపరిచిన గేదెల విజయ టీడీపీ మద్దతుదారు సూరీడమ్మపై 15 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

గౌతమికి ఎంపీపీ, జెడ్పీటీసీ అభినందనలు

వైఎస్సార్‌సీపీ మద్దతుతో సర్పంచ్‌గా ఎన్నికైన గౌతమికి ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు.



కొత్తవలస: తుమ్మికాపల్లి వార్డు మెంబర్‌గా ఎన్నికైన జ్యోతికి ధ్రువపత్రం అందజేస్తున్న ఆర్‌ఓ ధర్మారావు



బొండపల్లి: దేవుపల్లిలో జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు

లొట్లపల్లి వార్డు మెంబర్‌గా పల్ల గంగమ్మ

జామి: మండలంలో లొట్లపల్లి 10వార్డుకు శనివారం జరిగిన ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పల్ల గంగమ్మ పది ఓట్ల మెజార్టీతో టీడీపీ బలపరిచిన అభ్యర్థి చందక గౌరిపై విజయం సాధించింది. మొత్తం 131 ఓట్లకు గాను 110 ఓట్లు పోలవ్వగా.. గంగమ్మకు 60 ఓట్లు, గౌరికి 50 ఓట్లు వచ్చాయి. గంగమ్మ గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు.

కొత్తవలసలో..

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి, కాటకాపల్లి గ్రామాల్లో రెండు వార్డు స్థానాలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల ఆర్‌ఓ కె.ధర్మారావు తెలిపారు. తుమ్మికాపల్లి 3వ వార్డుకు కెంగం జ్యోతి, కాటకాపల్లి 2వ వార్డు స్థానానికి చుక్క భవానీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. వీరు ఇరువురూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కావడం గమనార్హం.

బొండపల్లిలో..

బొండపల్లి: మండలంలో నాలుగు పంచాయతీల్లో ఖాళీ ఏర్పడిన వార్డు స్థానాలకు ఉప ఎన్నిక నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయగా.. మూడు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. కొండకిండాం గ్రామంలో 5 వార్డు సభ్యునిగా కలిశెట్టి బంగారునాయుడు, ఒంపల్లిలో 2వ వార్డు మెంబరుగా దోంతల అప్పలనారాయణ, మరువాడలో 2వ వార్డు సభ్యునిగా దాసరి కాంతమ్మ వైఎస్సార్‌సీపీ మద్దతులో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవుపల్లిలో 13వ వార్డు స్థానానికి జరిగిన ఎన్నికలో టీడీపీ మద్దతుదారుడు గాధం రాజేంద్రకుమార్ 20 ఓట్ల తేడాతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు మల్లిరెడ్డి శ్యామలరావుపై విజయం సాధించినట్లు ఆర్‌ఓ సుగుణాకరరావు ప్రకటించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



ముసిరాంలో వీధికాలువలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తవలస: వర్షాకాలంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కీటక జనిత వ్యాధుల స్టేట్ కన్సల్టెంట్ జి.సాయికుమార్ సూచించారు. మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో వియ్యంపేట, ముసిరాం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ఫ్రైడే-డ్రైడే అమలు, తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాల్లో పర్యటించి ఆరోగ్య జాగ్రత్తలు, పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా సహాయ మలేరియా అధికారి డేగల వెంకటరమణ, పీహెచ్‌సీ వైద్యులు బి.సింహాద్రి, సబ్ యూనిట్ అధికారి బి.శ్రీనివాసరావు, ఎంటీఎస్ రాజశేఖర్, హెల్త్ సహాయకులు సత్యారావు ఉన్నారు.

పెండింగ్ ఈకేవైసీలపై దృష్టి

గజపతినగరం: ఈకేవైసీ పెండింగ్ లేకుండా చూడాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈకేవైసీ అప్‌డేషన్ వివరాలను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సోమవారం నిర్వహించే స్పందనలో అందిన వినతులను సకాలంలో పరిష్కరిస్తామన్నారు. అర్జీదారులు ఈకేవైసీ చేయించుకుంటే అన్నిరకాల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఈకేవైసీ నమోదుపై దృష్టి సారించాలన్నారు.

జాతీయ స్థాయి ఎంపిక పోటీలకు అర్హత

వేపాడ: బానాది గ్రామానికి చెందిన కుప్ప తులసి క్రీడల్లో రాణిస్తోంది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న తులసి ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 హాకీ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి ఎంపిక పోటీలకు అర్హత సాధించింది. ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలాలో జరిగే జాతీయ స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు శనివారం పయనమైంది. ఎంపీటీసీ జి.తులసి, జి.దేములు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

23 నుంచి తెలుగు భాషా వారోత్సవాలు

విజయనగరం టౌన్: వాగ్దేవి సమారాధనమ్, జైపైడిమాంబ వేద సంస్కృత పరిరక్షణ సేవా సంఘం ఆధ్వర్యంలో గిడుగు వేంకట రామమూర్తి జయంతి పురస్కరించుకుని తెలుగు భాషా పండుగ వారోత్సవాలను ఈ నెల 23 నుంచి 29 వరకూ నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ పి.స్వప్న హైందవి తులిసానేజ శనివారం స్థానిక గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తెలుగు భాషా పరిరక్షణకు గాను విద్యార్థులకు పద్యపఠనం, వ్యాసరచన, కథలు, కవితలు, క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28న గురజాడ గ్రంథాలయంలో గిడుగు జయంతి సభలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 87906 07303 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. అనంతరం పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారు బి.సూర్యలక్ష్మి, సంస్థ ప్రతినిధులు గురజాడ ఇందిర, సంధ్యారాణి, సుభద్రాదేవీ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు స్వస్తి పలకాలి



జామి: కుమరాం కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న ఎస్టీసీసీ రామకృష్ణ

జామి: రాష్ట్రంలో బాల్యవివాహాలకు స్వస్తి పలకాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ(ఎస్బీసీసీ) జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ అన్నారు. మండలంలోని కుమరాం కేజీబీవీలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనత, పౌష్టికాహారం, జంక్‌ఫుడ్ వల్ల కలిగే దుష్పరిణామాలు, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 112 నంబరుకు సమాచారం అందించాలన్నారు. 'బాల్యం చదువు కోసం-పెళ్లి కోసం కాదు' అనే గోడపత్రికను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బి.వి.సులోచన, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహం నిలిపివేత

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్ణాపురంలో శనివారం రాత్రి నిర్వహించ తలపెట్టిన బాల్య వివాహాన్ని అడ్డుకున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి తెలిపారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేశారు. 18 ఏళ్ల నిండకుండా పెళ్లి చేసినట్లయితే బాల్య వివాహ నిర్మూలన చట్టం-2006 ప్రకారం శిక్షార్హులుగా పేర్కొన్నారు. బాలికలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు.

సంక్షేమ పథకాలే విజయానికి కారణం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్, తదితరులు

జామి: మండలంలోని లొట్లపల్లిలో వార్డు మెంబర్ స్థానానికి శనివారం జరిగిన ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పల్ల గంగమ్మ విజయం సాధించింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, పార్టీ నాయకులు ఆమెకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మద్దతుతో స్థానిక సర్పంచ్ జన్నేల సింహాచలం నాయకత్వంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులే వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి విజయానికి కారమన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ శీర చందునాయుడు, విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు, వైఎస్సార్‌సీపీ నేతలు పన్నింటి రవికుమార్, జన్నేల సూరిదేముడు, ఎస్.వాసు, సిడగ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

• ముమ్మరంగా వరినాట్లు



లింగాలవలసలో వరినాట్లు వేస్తున్న రైతు కూలీలు

పొలాన్ని ట్రాక్టర్ సాయంతో దమ్ము చేస్తున్న రైతు

వర్షాలు అనుకూలించడంతో పాటు చెరువులు, కాలువల్లో సాగునీరు అందుబాటులో ఉండడంతో ఖరీఫ్ వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలో లింగాలవలస, శ్రీరంగ రాజపురం, కాలంరాజుపేట, కొత్తబగ్గాం, పాతబగ్గాం, చిట్టాయవలస, బంగారమ్మపేట, గంగచోళ్లపెంట, భూదేవిపేట తదితర గ్రామాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. రైతులు, వ్యవసాయ కూలీలు నారు తీత, పొలాన్ని దమ్ము చేయడం, వరినాట్లు వేయడంలో బిజీగా ఉన్నారు. మండలంలో ఇప్పటివరకు 50 శాతం వరినాట్లు పూర్తికాగా.. మరికొద్ది రోజుల్లో శతశాతం నాట్లు పూర్తవుతాయని వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు. – గజపతినగరం

ఉన్నత ఆలోచనలతో ముందుకుసాగాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి

• జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి

చీపురుపల్లి రూరల్(గరివిడి): విద్యార్థులు ఉన్నతమైన ఆలోచనలతో ముందుకు సాగాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎం.విజయరామేశ్వరి అన్నారు. గరివిడి అవంతీ సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.జాషువా జయప్రసాద్ నేతృత్వంలో ఎన్ఎస్ఎస్ యూనిట్, స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిర్మూలనపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి విజయరామేశ్వరి మాట్లాడుతూ.. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. బాధ్యతతో చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే ఏపీ ప్రొహిబిషన్ ర్యాగింగ్ యాక్ట్ 1997 కింద కనీసం 6 నెలల నుంచి జీవితాంతం జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. ర్యాగింగ్‌లకు పాల్పడి జీవితాలు పాడుచేసుకోకుండా చక్కగా చదువుకోవాలని సూచించారు. ఎస్సై ఎల్.దామోదరరావు మాట్లాడుతూ.. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నందున విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, వాహనాలు నడిపేటప్పుడు రోడ్డుభద్రత నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ మెంబర్ బి.శ్రీదేవి, న్యాయవాదులు డి.రఘుపతినాయుడు, కె.త్రినాథరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.సత్యం, వలంటీర్లు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు



లక్కవరపుకోట: వరుస పద్ధతిలో వరిసాగుపై అవగాహన కల్పిస్తున్న సబల సంస్థ ప్రతినిధి ఈశ్వరరావు

కొత్తవలస: వరిసాగులో మెలకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో సాగు చేస్తున్న వరి పంటను శనివారం ఆయన పరిశీలించారు. పంట తెగుళ్లను వ్యాప్తి చేసే పురుగులను ఆకర్షించేందుకు పసుపు అట్టలు వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

☛ **లక్కవరపుకోట:** వరిసాగులో వరుస సాగుపద్ధతిని అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సబల సంస్థ ప్రతినిధి కె.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని మార్లాపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసయ విధానంలో సాగుచేస్తున్న వరుస పద్ధతిని రైతులకు చూపించారు. ఈ పద్ధతివలన కలిగే ప్రయోజనాలను వివరించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

• డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు



వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

గంట్యాడ: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి గ్రామంలో ఉన్న వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలు, ఓపీ రికార్డులు, ఫార్మసీని పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు గ్రామస్థాయిలోనే మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిందని, సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలందించాలన్నారు. వైద్యం అందక మరణించారనే మాట రాకూడన్నారు. కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలిగించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్, తదితరులు ఉన్నారు.

88 మందికి వైద్యసేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: మండలంలోని ముచ్చర్ల గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మరుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ కారిణి సుష్మ 88 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ హర్షప్రియ, ఆరోగ్య కార్యకర్త శ్రవంతి, ఆశాలు జ్యోతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎం.లింగాలవలసలో..

దత్తిరాజేరు: మండలంలోని ఎం.లింగాలవలస గ్రామంలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 85 మందికి వైద్య సేవలందించినట్లు దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందించినట్లు చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ నెల గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన



ఓటుహక్కును వినియోగించుకుంటున్న విద్యార్థిని

కొత్తవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల నిర్వహణపై శనివారం అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సీహెచ్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్పీఎల్ ఎన్నిక నిర్వహించారు. ముందుగా నోటిఫికేషన్ విడుదల చేయగా.. 10 మంది విద్యార్థులు నామినేషన్ వేశారు. వారికి ఉపాధ్యాయులు గుర్తులు కేటాయించారు. అనంతరం అభ్యర్థులు తరగతి గదుల్లో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల సిబ్బందిగా పలువురు విద్యార్థులను నియమించారు. బాలికలు, బాలురకు వేరువేరుగా బ్యాలెట్ బాక్స్‌లు ఏర్పాటు చేసి పోలింగ్‌ను ప్రారంభించారు. 510 మంది విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఓట్లు లెక్కింపు చేపట్టగా.. 127 ఓట్లు సాధించిన ఎస్.ప్రసన్న ఎస్పీఎల్‌గా ఎన్నికైనట్లు కౌంటింగ్ సిబ్బంది ప్రకటించారు. రెండో ఎస్పీఎల్‌గా సీహెచ్ నిహారిక 99 ఓట్లు సాధించినట్లు తెలిపారు. సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయులు కె.సన్యాసమ్మ, పి.నర్సింహులు, సిహెచ్.సన్యాసమ్మ ఎన్నిక ప్రక్రియను పర్యవేక్షించారు.